# ఛాయాగీతం

ఓ. సుజాతాదేవి

**పూలదండలు** అరచేతులనుంచీ మోచేతుల వరకూ విస్తరించి కిందికి వేలాడుతున్నాయి. తలలోనూ అవే ముళ్ళ గోరింట పూలు. చిలకాకు పచ్చ పరికిణీ మీద ఎర్రటి జాకెట్టు. పసుపుపూల ఓణీ. చామనచాయ ముఖంలో మెరుపుల కళ్ళు. నునుపు బుగ్గలు. అడుగుల్లో తొందర. పూలు నలిగిపోతాయని జాగ్రత్త కలిసి తమాషాగా నడిచి వస్తోంది నాగమల్లి. మెట్లెక్కి సింహద్వారం దాటి నడవలో నిలబడి అటు నాలుగు, ఇటు నాలుగు ఉన్న ఎనిమిది గుమ్మాలూ లెక్క పెట్టి, చేతిలో ఉన్న పూలదండలు ఉజ్జాయింపుగా చూసుకుంటూ పడమటి గది గుమ్మంలో అడుగు పెట్టింది నాగమల్లి. వాకిలి కున్న పూల పరదాను ఒత్తిగించుకుని సాంబ్రాణి ధూపం తెరలు తెరలుగా నాగమల్లిని చుట్టేసింది. అప్పటివరకూ పదిలంగా మోస్తున్న పూలదండలకు వాసన లేదని గుర్తొచ్చి నిరసనగా చూసింది. లోపల నుంచి సన్నగా నవ్వులు సెలయేటి జాలులా మొదలై, కొండవాగులా ఉధృతమౌతుండగా, చేతుల నిండా పూలదండ లుండడం వలన తలతోనే కర్టెను నెట్టుకుంటూ గదిలో కెళ్ళింది నాగమల్లి.

గది మధ్యలో ఉన్న పందిరి పట్టెమంచం మీద మూలకు ఉన్న దిళ్ళపై తల వెనక్కు వాల్చి తెరలు తెరలుగా నవ్వుతోంది రాజేశ్వరి. ఆ పక్కనే ముక్కాలి పీటమీద రేకులో ఉన్న నిప్పులపై గుప్పెడు సాంబ్రాణి వేసింది సుబ్బులు. ఆపైన వెదురు పేళ్ళతో అల్లిన జల్లు బుట్ట బోర్లించింది. జల్లెడలా అల్లిన ఆ బుట్టలోంచి గుప్పు గుప్పున వచ్చే సాంబ్రాణి ధూపంమీద రాజేశ్వరి నల్లటి నిడుపాటి కురులు జారవిడిచింది. మొగలి పొత్తిలా ఉన్న రాజేశ్వరిని మురిపెంగా చూసింది నాగమల్లి.

"ఏమిటే అలా చూస్తావు? అరె! పెద్ద దండే అయిందే" అని చేతులు చాపింది రాజేశ్వరి.

"అన్ని గుమ్మాలకూ కావాలన్నారుగా" అని పదిలంగా పూలదండలు పక్కమీద పెట్టింది నాగమల్లి.

"అయ్యో! నీ కేమన్నా పిచ్చి పట్టిందేమో?! ముళ్ళగోరింట పూలు గుమ్మాల క్కట్టినా ఎన్నాళ్ళుంటాయి?" అని నాగమల్లిని కసిరింది సుబ్బులు.

"పోనీలే, సుబ్బులూ. నేనే తెమ్మన్నా. రేపొక్క రోజూ ఉంటే చాలులే" అంది రాజేశ్వరి పూలదండను అరచేత తాకుతూ.

ఆ పూలదండలనూ, రాజేశ్వరినీ మార్చి మార్చి చూస్తున్న నాగమల్లి నవ్వింది. నవ్వుతున్న నాగమల్లినీ, విచ్చిన పూలనూ చూస్తూ రాజేశ్వరీ నవ్వింది. నవ్వుతున్న ఆ పడుచు లిద్దర్నీ చూస్తున్న సుబ్బులు కళ్ళకు చల్లగా, మనసుకు హాయిగా అనిపించి తనకు తెలియకుండానే నవ్వొచ్చింది.

అంతరా లెరుగని చల్లగాలి తెర ఒకటి చప్పుడు కాకుండా గదిలో కొచ్చి నాగమల్లి జడలోని గోరింటపూలను స్పృశించి, సుబ్బులు పమిట చెంగుతో ఆడుకుంటూ, రాజేశ్వరి నీలి కురులను ముద్దాడి పారిపోయింది. ఊరి చివరి మర్రిచెట్టు కొమ్మల వెనకనించి, ఆవరణ లోని పారిజాతం ఆకుల మధ్యనుంచి తప్పించుకు వచ్చిన సాయం సూర్యుని చివరి కిరణం నాగమల్లి ముఖాని కో చాయ మెరుగు పెట్టి, రాజేశ్వరి ముక్కునున్న



వజ్రపు పుడకమీద (మనసు) పడి తళుక్కున మెరిసింది.

వెండి గిన్నెలో పెట్టి తడిగుడ్డ మూత వేసిన గోరింటాకు ముద్ద పట్టు కొచ్చింది సుబ్బులు. "ముందు కాళ్ళకు పెట్టండమ్మా" అంటూ.

"సుబ్బులూ! ముత్తయిదువ లందర్నీ ఓ సారి పిలిచి గోరింటాకు ఇచ్చి రావాలి. రాముడికి చెప్పి మన తోటలో ఉయ్యాల వేయించాలి" అంది. రాజేశ్వరి.

"నే వెళ్ళనా?" ఉత్సాహంగా అంది నాగమల్లి.

"నువ్వొద్దులే. సుబ్బులు వెళ్తుంది."

"అయితే మీకు నేనే గోరింటాకు పెడతానమ్మా". అంది నాగమల్లి. అనడమేమిటి. సుబ్బులు చేతుల్లోంచి గిన్నె లాక్కుంది.

"ఓసి నీ ఆత్రం పాడుగాను. ఇంక మూణ్ణెల్లలో ముక్కుకు తాడు పడుతుందిగా! నీ ఆరాటం అణుగుతుందిలే" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది సుబ్బులు.

తల వంచి గిన్నెలో గోరింటాకు కలుపుతున్న నాగమల్లి వైపు కుతూహలంగా చూసింది రాజేశ్వరి. నవ్వు లేకుండా నాగమల్లి ముఖం నగలన్నీ తీసేసినట్లు బోసిపోయి ఉంది.




ఆ రోజు పెళ్ళిచూపులనాడు నాగమల్లి కళ్ళలో వెలుగు తనకు పరిచయమే. మరి ఇప్పు డిలా అనుమాను పడింది రాజేశ్వరి. ఎంత నచ్చిన వరుడైనా. పెళ్ళి అనగానే పుట్టి పెరిగిన ఇల్లూ. ఊరూ వదలి వెళ్ళాలనే దిగులు ఆడపిల్లకు సహజమే అనుకుంది రాజేశ్వరి. అల్లరి చేస్తూనే అణకువ చూపిస్తూ. నవ్వుతూ. త్రుళ్ళుతూ కలకలలాడే నాగమల్లిలో తను పారవేసుకున్న చిన్ననాటి చిరునవ్వుల నగిషీలు చూస్తుంది రాజేశ్వరి. తాను మరచిపోయిన ఉత్సాహం. తనను విడిచిపోయిన సంతోషం నాగమల్లిలో చూసి ముచ్చట పడుతుంది. లేచి ఓ కాలు పీటమీద పెట్టి. జుట్టు ముందుకు వేసుకుని దిళ్ళమీద ఒరిగి కూర్చుంది. ముఖం కిందికి దించి దిగాలుగా కూర్చుంది నాగమల్లి.

"పిచ్చి పిల్లా! ఎందుకే దిగులు! ఆడపిల్ల అంటేనే అక్కడి పిల్ల అని అర్థం. అందరిలానే నువ్వూ ఓ అయ్య చేయి పట్టుకుని అమ్మను. ఆడి పాడిన స్నేహితులను వదిలి వెళ్ళాల్సిందే" అంది రాజేశ్వరి. కాని ఆ ఓదార్పులో తనకే అర్థంకాని ఏదో వెలితి. తలెత్తి చూసింది నాగమల్లి. యజమానురాలిలా కాక స్నేహితురాలిలా తనను చూసే చక్కటి కళ్ళు. తీరైన కనుబొమలకు పైగా చుక్కబొట్టు. నుదుటిమీద నగిషీలు పెట్టినట్టు నొక్కుల జుట్టు. అలలు అలలుగా వక్షాన్ని కమ్ముకున్న ఒత్తయిన తలకట్టు.

రాజేశ్వరి నెప్పుడు చూసినా అంతే. చూడగానే హాయిగా. సంతోషంగా అనిపించి చూస్తున్న కొలదీ దిగులుగా చివరకు దుఃఖమొస్తుంది. తల వంచి కాలికి గోరింటాకు పెడుతున్న నాగమల్లి కళ్ళు ధారలు కట్టి పమిటలో ఇంకిపోవడం రాజేశ్వరికి తెలియదు. సున్నితమైన పాదాల కున్న బంగారు పాంజేబులు తప్పించి పచ్చగా గోరింట పారాణి పూస్తున్న నాగమల్లికి ఆ సుందరి నయనాల్లో సుడులు తిరిగే ఆలోచనలు తెలియవు.

రాజేశ్వరి కళ్ళలో గడచిన ఆశ్వయుజ తదియల ఆనవాళ్ళు కదులుతున్నై. కోరినవాడు చేబడతాడని నమ్మకంగా చెప్పే గోరింట పంటలు-ఈడైన జోడుకోసం వెన్నెల్లో ఆటలు-అనురూప వరుడికోసం అట్లతద్ది నోములు వెంటవెంటబడి నవ్వుతున్నాయి. తొలిసారి అట్లతద్ది నోము పట్టించడం తన కెంత గుర్తో! అలవాటు లేని ప్రైము-ఆటల మీద మనసు. తెల్లవారుఝామున చద్దిఅన్నం ముద్ద దిగలేదు. తెల్లారి పది గంటలవరకూ పూల తోటల్లో పరుగులు-ఆ తరువాత ఉయ్యాల సందడి. మధ్యాహ్నమయేసరికి ఆకలితో ప్రాణం కడబట్టిపోయింది. అన్నం తిని ఎన్నాళ్ళో అయినట్టు. ఇంకెప్పటికి తిండి ముఖం చూస్తుందో తెలియనట్టు "పిల్లా. ఆకలేస్తొందని ఏమైనా తిన్నావో ముసలి మొగుడొస్తాడు- జాగర్త" అని ముత్తయిదువల హెచ్చరికలు. ఇంట్లోనే తనకోసం దూలానికి వేసిన ఉయ్యాలలో స్పృహ తప్పినట్లున్న తనను చూసి నిప్పు తొక్కినట్లు నాన్న గంతులు. "అన్నీ మీ చాదస్తాలు-మీ చేతుల్లో దాని ప్రాణాలు తీయకుండా ఏదో ఒకటి పెట్టండి" అని కేకలు. "కాస్త మజ్జిగివ్వండి. మజ్జిగ పంచామృతాల్లో ఒకటి" అని ఒకరి సలహా. "ఆఁ. ఊరుకుందురూ. మీ పిల్లే ఉందా ఉపవాసం! మరోటీ మరోటీ కాదు అట్లతద్ది. కన్నెపిల్లలు అసలు వ్రతభంగం చేయ

కూడదు. అంత అబ్బరాల పీల్ల ననలు నోమేం దుకు పట్టించారు" అని మరొకరి విసుగు. చివరకు అందరూ ఆమోదించి నిండు బిందెనుంచి గ్లాసుడు నీళ్ళు తీ °సి, దోషం పోవడానికి చిటికెడు వసుపు వే °సి ఇచ్చారు. తీరా గ్లాసు నోటి దగ్గర పెట్టుకునేసరికి "పిల్లా! ముసలి మొగుడొస్తాడు-జాగర్త" అని హెచ్చరికలు వినబడినట్లై గ్లాసు వదిలే °సింది. "అయ్యో! గ్లాసు పట్టుకునే ఓపికైనా లే"దని మళ్ళా ఇచ్చారు. అయినా భయమే. "తాగుతా, తాగుతా " అని అవతలికి తీసుకెళ్ళి పారబో °సింది.

తెలి °సి తెలియని ఆ వయసులోనే అంత భయమెందుకో! ముసలి మొగుడంటే నవ్వొచ్చింది రాజేశ్వరికి. ఎంత నియమంగా నోచింది అట్లతద్ది నోములు!, ఏడుపొచ్చింది రాజేశ్వరికి. ఎండా వానల్లా ఏడుపూ, నవ్వూ తెరువు మరువుల మధ్య ఉండగానే సుబ్బులు తిరిగొచ్చింది "అందర్నీ పిలిచానమ్మా" అంటూ.

"సరే" అన్నట్లు తలూపింది రాజేశ్వరి.

"నాగూ! నువ్వమ్మగారి దగ్గరుండు. నేను వంటామెకు సాయం చెయ్యాలి" అంటూ సుబ్బులు వెళ్ళిపోయింది.

కళతప్పిన మల్లి ముఖం పరిశీలనగా చూ °సింది రాజేశ్వరి.

"అదేమిటే, మల్లీ, కళ్ళలా ఎర్రబడ్డాయి? ముఖమంతా నల్లబడింది. ఎందుకంత దిగులు?" నాగమల్లి మాట్లాడకుండా రాజేశ్వరి అరచేతిలో గోరింటాకుతో పూలు పెడుతోంది.

"ఆ రోజు పెళ్ళిచూపుల్నా డంత ఉత్సాహంగా ఉన్నావ్‌గా? నే నా పిల్లాడి పే రడిగితే..."రాజేశ్వరి చేతిని గట్టిగా పట్టుకుని, "కాదమ్మా-అతను కాదమ్మా" అంది మల్లి వణికే స్వరంతో.

"అతను కాదా? ఆ నాలుగు రోజులూ ఎంత సంబరంగా తిరిగింది మల్లి! అతను కాదా? ఏం? ఎందుకని?"

"ఆళ్ళకి వెయ్యి రూపాయలు కావాలంట. ఆడబడుసు కట్నం నూట పదార్లంట."

దుఃఖాతిరేకంతో అదిరే కింది పెదవిని పైపంటితో నొక్కుతూ తల వంచుకుంది మల్లి. తెగిన హారంలోంచి పూసలు రాలిపోతున్నట్లు టప టప జారి పడుతున్న మల్లి కన్నీళ్ళు రాజేశ్వరి అరచేతులను తడుపుతున్నై.

"ఏడవకు-ఏడవకు, మల్లీ. ఇటు చూడు" అని మల్లి గడ్డం పట్టుకుని తల పైకెత్తింది. నీళ్ళు నిండిన ఆ కళ్ళలో తన ప్రతిబింబం...తనదే...అది గో-మరో రాజేశ్వరి...

ఓరగా ఉన్న తలుపులు తోసుకుని నీడలా వచ్చిన ఆకారం. "అదేంటమ్మా చీకట్లో" అని లైటువే °సింది. ఆమె మాలక్ష్మి. మల్లికి తల్లి. ఆ వెలుతురులో కల °సి పట్టుకున్న చేతులు-కల °సి ప్రవహిస్తున్నట్టు కన్నీళ్ళు. ఆ ఇంటి సేవకురాలు మాలక్ష్మి కంగారుపడింది. ఆమెక్కడ, తా మెక్కడ? కాని మాలక్ష్మిలోని తల్లికి అర్థమయింది వా ళ్ళిద్దరూ ఆడపిల్లలని.

"అమ్మా, నేనేం చైను, తల్లీ!" అని గోడపక్కనే కూలబడింది. రాజేశ్వరి చేతి సెగతో లైటు తీ సే °సింది మాలక్ష్మి.

రాజేశ్వరికి తన పెళ్ళికి కన్నీరు మున్నీరుగా విలపించిన అమ్మ గుర్తొచ్చింది. అత్తయ్య గుర్తొచ్చింది. పదిమంది పెద్దల ఎదుట తన మెడలో చంద్రహారం వే °సి 'నా కోడలు' అని చాటింది అత్తయ్య. నాన్న, మామయ్య ఒకరి కొకరు బొట్టు పెట్టుకొని మేళతాళాలతో వేద మంత్రాల మధ్య "మన మిద్దరం వియ్యమందుతున్నాము" అని పెద్దల సాక్షిగా, పురోహితుల సాక్షిగా, పంచభూతాల సాక్షిగా వాగ్రూపంగానూ, లిఖితరూపంగానూ తాంబూలాలు మార్చుకున్నారు. కాని...ఒక ఐశ్వర్యవంతుడి ఏకైక పుత్రిక నీయడానికి ఇష్టపడగానే ఇక్కడి బాసలు నీట కలి °సిపోయినై. అంతే! అంతకన్నా మంచి సంబంధం తనకు తేవాలని, వాళ్ళకన్నా ముందు తన పెళ్ళి చేయాలనే పట్టుదలతో నాన్న కన్న ప్రేమకే నీ ళ్ళొదులుకున్నాడు. వయసు మళ్ళిన అల్లుణ్ణి అట్టహాసంగా తెచ్చుకున్నాడు. అష్టయిశ్వర్యాలతోనూ, దాసదా °సిలతోనూ అంగరంగ వైభోగాలతో తన బ్రతుకు తెల్లారిపోతున్నది. పనివారితో పొద్దులు గడుపుటే తనకు ముద్దు ముచ్చటలు. కనీసం ఆయనగారి మనసుకైనా దగ్గరవాలని తన తాపత్రయం. తన ఐశ్వర్య ప్రకర్షతో ఆమె నద్భుతపరచాలని ఆయన ఆర్భాటం.

ఆ రోజు అత్తయ్య అభిమానంగా తన మెడలో వే °సిన చంద్రహారం అలాగే ఉండిపోయింది. మెడలో చంద్రహారం తీ °సి మాలక్ష్మి ఒడిలో వే °సింది రాజేశ్వరి.

"అమ్మా!" భయంగా అంది మాలక్ష్మి.

"అదెక్కడైనా అమ్మి మల్లికి నచ్చిన మనువు చెయ్యి." అంత తేలిగ్గా మల్లి సమస్య పరిష్కారమైనందుకు రాజేశ్వరి ముఖం సేదదీరినట్లు ప్రశాంతంగా ఉంది.

"అయ్యగారికి తెలిత్తే ఇంకేమైనా ఉందా!" మాలక్ష్మి కళ్ళనిండా భయం. గొంతునిండా ఆశ్చర్యం.

"ఫర్వాలేదు. అయ్యగారికి తెలియదు. ఈ లక్ష్మీ నిలయంలో నాదీ అనేది ఇదొక్కటే. దీనివల్లైనా మల్లి బతుకు బాగుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది" అంది రాజేశ్వరి.

"వద్దమ్మా. నా మన సొప్పడం లేదు. దాని రాతెట్టా గుంటే అట్టా గవుద్ది."

"హుఁ!" నవ్వొచ్చింది రాజేశ్వరికి.

"మా రాతలో, మీ చేతలోగాని 'కాదన్నవాడి కాళ్ళు కడగడమా' అని పౌరుషానికి పోయి దాని బతుకు పాడుచేయకండి. మీ పంతాలు, పట్టింపులు, బేరాలు... ఇవేగా మా రాతలు రా సేది!"

నీరసంగా నవ్వింది రాజేశ్వరి. తన మనః °స్థితీ, పరి °స్థితీ, పెళ్ళీ, సంసారం, పెద్దలూ, పట్టింపులూ-అన్నీ గుర్తొచ్చాయి. ఆవేశం, ఆవేదన, దుఃఖం ముప్పిరిగొనగా మూ ర్ఛిల్లిన దానిలా మంచం మధ్య పడిపోయింది.

ఆమెను మాట్లాడించే ధైర్యం లేక మౌనంగానే నమస్కరించి నాగమల్లిని తీసుకుని వెళ్ళిపోయింది మాలక్ష్మి. ●

